సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 30 | నవంబర్ | 2024



ఉద్యమ కల సాకారం - 8లో▸

అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణ పనులు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.



ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ప్రాణం తీసింది..

ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళతో ఏర్పడిన పరిచయం ఓ యువకుడి హత్యకు దారితీసింది.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$28^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి టెన్నిస్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం ఆవరణలోని లాన్‌టెన్నిస్ కోర్టులో శుక్రవారం పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14, 17 బాలబాలికల హనుమకొండ జిల్లా స్థాయి టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దస్రూనాయక్ తెలిపారు. అందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల్లో అండర్–14 విభాగంలో ఐదుగురిని, అండర్–17 విభాగంలో ఐదుగురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నేడు (30వ తేదీన) రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికల్లో డీఎస్‌ఏ టెన్నిస్ కోచ్ వెంకటేశ్వర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: విదేశాల్లో విద్యాభ్యాసం కోసం అర్హులైన మైనార్టీ విద్యార్థులు (ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పార్శీలు) ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి టి.రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం ఓవర్సీస్ పథకం ద్వారా విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, పోస్ట్ డాక్టరోల్ స్టడీస్ కోసం అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, కెనడా, ఫ్రాన్స్ జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సౌత్‌కొరియా, సింగపూర్ దేశాల్లో చదువుకోవడానికి అర్హతగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 31 లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 0870–2980533, 93988 60995 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డిగ్రీ పరీక్షల్లో 23 మంది మాల్‌ప్రాక్టీస్


కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శుక్రవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 23 మంది విద్యార్థులు పట్టుబడగా వారిని మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య తెలిపారు.

ప్రజల్ని కాపాడేందుకు అవగాహన కల్పించాలి



కాజీపేట: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి అన్నారు. కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి చెరువు కట్టపై శుక్రవారం ఎన్డీఆర్‌ఎఫ్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రజలు తమకు తాము బయట పడేలా తరచూ అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జైపాల్‌రెడ్డి, నాగమణి, సీఐ వై.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాస్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి



విద్యారణ్యపురి: డిసెంబర్ 4న హనుమకొండ జిల్లాలోని పాఠశాలల్లో నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని డీఈఓ వాసంతి కోరారు. శుక్రవారం హనుమకొండ లష్కర్‌బజార్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. అందులో డీఈఓ పాల్గొని మాట్లాడుతూ.. విద్యాప్రమాణాలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈసర్వే నిర్వహిస్తుందని తెలిపారు. శిక్షణలో జిల్లా ప్రభుత్వ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, డీసీఈబీ సెక్రటరీ డాక్టర్ బి.రాంధన్, కో–ఆర్డినేటర్ నవీన్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ మదుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

● 'గ్రేటర్ వరంగల్'లో కాంట్రాక్టర్ల గూడుపుఠాణి

రూ.187.42 కోట్లపై కన్ను!



కలిసి ఉంటే కలదు సుఖమన్నట్లు సిండికేట్

- పనుల పందేరానికి మళ్లీ యత్నాలు
- ప్రజా ప్రతినిధులు'.. ఇంజనీర్ల సహకారం
- ఎవరికి ఎంత కమీషన్ ఇవ్వాలనే దానిపై రాని స్పష్టత





వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్‌లో మళ్లీ కాంట్రాక్టర్ల సిండికేట్ వ్యవస్థ వేళ్లూనుకుంటోంది. అభివృద్ధి పనుల పంపకాలకు వ్యూహ రచనలు చేస్తున్నారు. 2015–2018 సంవత్సరాల్లో సాగిన కుమ్మక్కు, మామూళ్ల వ్యవహారం తాజాగా తెరపైకి తీసుకువచ్చారు. అధి కార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతో బడా కాంట్రాక్టర్లు యూనియన్లుగా మారి చకచకా పావులు కదుపుతున్నారు. కార్పొరేటర్ల నుంచి ఆపై ప్రజా ప్రతినిధులకు, ఇంజనీర్లు, ఇతర సెక్షన్ల పర్సంటేజీలపై తాజాగా రహస్య సమావేశం నిర్వహించి చర్చలు జరిపినా కొలిక్కి రాలేదని తెలిసింది. ఇటీవల ప్రభుత్వం బల్దియాకు వివిధ పద్దుల కింద పెండింగ్‌లో ఉన్న రూ.187.42కోట్ల నిధులను కేటాయిస్తూ జీఓ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో ఆ నిధులపై బడా కాంట్రాక్టర్ల కన్ను పడింది. పూర్తయిన, కొన సాగుతున్న పనులకు సంబంధించిన బకాయిలు సుమారు రూ.70కోట్ల మేరకు ఉన్నా యి. కొత్తగా అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉంది. దీంతో అభివృద్ధి పనుల విషయంలో ఎలా ముందుకు సాగాలనే అంశాలపై చర్చిస్తున్నారు.

రెండు యూనియన్లుగా...

బల్దియాలో కొన్నేళ్లుగా యూనియన్లు రద్దయ్యాయి. లైసెన్స్ కలిగి ఉన్న కాంట్రాక్టర్లు ఎవరికి తోచిన విధంగా వారు పనులకు టెండర్లు దాఖలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. సుమారు 600 మంది వరకు సివిల్ కాంట్రాక్టర్లు ఉన్నారు. పనులు పూర్తయినా సకాలంలో బిల్లులు చేతికందకపోవడం, పర్సంటేజీల విషయంలో స్పష్టత లేకుండా ప్రజాప్రతినిధుల అండదండలు, పైరవీకారులు, బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో అందరం కలిసి ఉంటే కలదు లాభం అన్నట్లుగా 60శాతానికి పైగా కాంట్రాక్టర్లు యూనియన్లకు ముందుకొచ్చారు. ఇదే విషయాన్ని ప్రజాప్రతినిధుల ఎదుట మొరపెట్టుకున్నారు. వారు ఏం హామీ ఇచ్చారో తెలియదు గానీ, యూనియన్లకు మళ్లీ ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. నక్కలగుట్ట, కాశిబుగ్గ సర్కిళ్ల పరిధిలో రెండు యూనియన్లు తిరిగి పునరుద్ధరించారు. నక్కలగుట్ట సర్కిల్ పరిధిలో పదవుల కోసం పోటీ ఉండడంతో ఓట్ల రూపంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో కొందరు కాంట్రాక్టర్లు యూనియన్ ఏర్పాటుకు దూరంగా ఉండడంతో కొంతమంది చోటా, మోటా కాంట్రాక్టర్లతో కలిసి యూనియన్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేసుకొని ప్రకటించారు. దీంతో అసమ్మతి కాంట్రాక్టర్లు యూనియన్ ఏర్పాటు, అందులోని కార్యవర్గాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మార్పులు చేసుకోవాలని సలహా ఇవ్వడంతో మళ్లీ కార్యవర్గంపై కసరత్తులు చేస్తున్నారు. ఈక్రమంలో గతంలో వైట్ కాలర్, మరో బడా కాంట్రాక్టర్, అభివృద్ధి పనుల పేరిట, యూనియన్ పేరిట తమ నుంచి తీసుకున్న వసూళ్ల లెక్కలు తేల్చాలని, సొమ్ము తిరిగి ఇవ్వాలని చిన్న కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది కార్పొరేటర్లకు కమీషన్లు చెల్లించామని, మళ్లీ ఇదేంటని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్ద కాంట్రాక్టర్లు తమను బలి పశువులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. కాగా.. గతంతో సంబంధం లేదని, ప్రస్తుతం అందరం కలిసి ముందుకు సాగాలని ఓదార్పులు, బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది.

పర్సంటేజీల చిచ్చు

మూడేళ్లుగా జీడబ్ల్యూఎంసీ ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతోంది. వివిధ పనులు పూర్తయిన వెంటనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో డబ్బులు లేవని, కొత్త పనులు చేయలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఈ క్రమంలో ఏడాదిన్నర కిందట కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) రూ.30కోట్ల నిధులను మళ్లించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. ఏడాదిన్నరగా పట్టణ ప్రగతి, సీఎంఏ, ఎస్సీ ఉప ప్రణాళిక, తదితర నిధులు విడుదలతోపాటు అభివృద్ధి పనులు చాలామేరకు నిలిచిపోయాయి. తాజాగా ప్రభుత్వం గ్రాంట్లను కేటాయిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆనిధులపై బడా కాంట్రాక్టర్లు కన్ను వేశారు. ఇంజనీరింగ్ డీబీ సెక్షన్‌కు 0.25శాతం, టెండర్ లెస్ 2శాతం లోపు వేయాలని, స్థానిక కార్పొరేటర్‌కు 4శాతం, ఆపై ప్రజాప్రతినిధులకు 4శాతం, ఏఈకి 4శాతం, డీఈకి 3శాతం, ఈఈకి 2శాతం, ఎస్‌ఈకి 1 శాతం, ఆడిట్ విభాగం, అకౌంట్స్ ఇలా ఎంత మేరకు కమీషన్లు చెల్లించాలని పలుమార్లు జరిగిన సమావేశాల్లో తర్జనభర్జన పడినట్లు తెలిసింది. అయితే పర్సంటేజీల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదని సమాచారం. ఏదేమైనా అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలు, సకాలంలో పూర్తి చేసే విషయాలను పక్కన పెట్టి కమీషన్లు, లాభాపేక్ష యావపై ప్రస్తుతం బల్దియాలో జోరుగా చర్చలు కొనసాగుతుండడం గమనార్హం. ఈ విషయంపై బల్దియా ఇంజనీరింగ్ అధికారిని వివరణ కోరగా, ఆ విషయం తమ పరిధి కాదని, నాణ్యతాప్రమాణాలు, సకాలంలో పనులు పూర్తి చేయాల్సిందేనని సమాధానమిచ్చారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వాణీదేవి, చిత్రంలో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యేలు



తెలంగాణ ఒక్క రోజులో రాలేదు

- జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ వాణీదేవి
- హనుమకొండలో ఘనంగా దీక్షాదివస్

న్యూశాయంపేట: తెలంగాణ రాష్ట్రం ఒక్క రోజులో రాలేదని, రాష్ట్ర సాధన కోసం మృత్యువును సైతం ముద్దాడేందుకు కేసీఆర్ తెగించిన రోజు నవంబర్, 29 అని దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన శుక్రవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మొదట అదాలత్‌లోని అమరవీరుల స్తూపానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాలినడకన నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి, ఏకశిల పార్కులో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాలసముద్రంలోని కార్యాలయంలో తెలంగాణ తల్లికి పూలమాలలు వేశారు. ఆ తర్వాత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అలనాటి పోరాటాల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈసందర్భంగా వాణీదేవి మాట్లాడుతూ కేసీఆర్ అంటే తెలంగాణకు దిక్సూచి అని అన్నారు. 60 ఏళ్ల కలను రాష్ట్ర సాకారం చేసిన నేత అని కొనియాడారు. రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ అధికారం కోల్పోయినా అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పదినెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, వచ్చే సమయం మనదేనని, అందుకు అనుగుణంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 2009 నవంబర్, 29 దీక్ష ఒక చరిత్ర అని, ఆనాటి పరిస్థితులు కేసీఆర్ వెంట నడిచిన క్షణాలను ఈ సందర్భంగా కార్యకర్తలకు వివరించారు. నాడు నేను, నాయిని నర్సింహారెడ్డి జైలు జీవితం అనుభవించామన్నారు. దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణకు అడుగులు పడిన రోజు దీక్షా దివస్ అని గుర్తుచేశారు. అప్పటి దీక్షలో కేసీఆర్ వెంట నడిచిన రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వొడితల సతీశ్‌కుమార్, డాక్టర్ రాజయ్య, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, చల్లా, వొడితల తదితరులు



జమిలీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖేల్ ఖతం

వరంగల్ దీక్షా దివస్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు - 9లో▸

నేనున్నాను.. అధైర్యపడకండి

- మీకు డయాలసిస్ సేవలందుతాయి
- వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: 'కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని 'సూపర్' ఆస్పత్రిలో రెండు రోజులుగా నీళ్ల లేక డయాలసిస్ సేవలు నిలిచాయి. ఇద్దరు రోగులు మృతి చెందారు. మాకు న్యాయం చేయండి' అంటూ.. ఓ వృద్ధుడు శుక్రవారం ఎంజీఎంకు వచ్చిన కలెక్టర్ ఎదుట ఆందోళనకు దిగాడు. కలెక్టర్ స్వయంగా 'పెద్దమనిషి.. నేను నీ చెయ్యి పట్టుకున్నాను.. నువ్వు అధైర్యపడకు.. మీకు అండగా ఉంటా. ఆస్పత్రికి నీరందిస్తా.. డయాలసిస్ సేవలు ప్రారంభిస్తా' అంటూ సముదాయించారు. అక్కడున్న ఎంజీఎం అధికారులను పిలిచి వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించి డయాలసిస్ సేవలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. డయాలసిస్ రోగులపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంజీఎం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌ను ఆదేశించారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ కౌంటర్లను కలెక్టర్ సత్యశారద పరిశీలించారు.



ఆందోళన చేస్తున్న రోగిని సముదాయిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద



- 10లో▸

నిట్ స్నాతకోత్సవానికి సిద్ధం

- నేడు పట్టాలందుకోనున్న 1,875 మంది విద్యార్థులు
- తొలిసారిగా పీహెచ్‌డీ, పీజీ విద్యార్థులకు బంగారు పతకాలు

వరంగల్ నిట్ 22వ స్నాతకోత్సవం(కాన్వొకేషన్) శనివారం జరగనుంది. ఇన్‌స్టిట్యూట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెక్రటరీ డైరెక్టరేట్ ఆఫ్ డిఫెన్స్(ఆర్అండ్‌డీ) డీఆర్డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ హాజరవుతున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. - కాజీపేట అర్బన్

విద్యార్థులు శాస్త్రవేత్తలు కావాలి

- సైన్స్ సెంటర్ కోసం రూ.10 కోట్ల నిధులకు ప్రతిపాదన
- ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్ ప్రారంభ సభలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

విద్యారణ్యపురి: సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. పాఠశాల విద్యాశాఖ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ హైస్కూల్‌లో శుక్రవారం బాలల విద్య వైజ్ఞానిక ప్రదర్శనల (ఇన్‌స్పైర్ మనాక్, సైన్స్‌ఫేర్) అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమంలో సభకు అధ్యక్షత వహించిన నాయిని మాట్లాడుతూ.. ప్రముఖ భారత శాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. హనుమకొండలోని రీజినల్ సైన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.10 కోట్ల నిధుల కోసం ప్రణాళికలు రూపొందించి సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని ముందుకెళ్లాలన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధి ఆ దేశాల శాస్త్రాభివృద్ధిపై ఆధారపడి ఉంటుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. అబ్దుల్‌కలాం ఆశించినట్లుగా విద్యార్థులు కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవాలన్నారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్ విద్యార్థులకు గొప్ప అవకాశమని, ప్రతీ పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ప్రాక్టికల్స్ చేస్తే ఆయా సబ్జెక్టులపై అవగాహన పెరుగుతుందన్నారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ.. జిల్లాలో లక్షా 20 వేల మంది విద్యార్థులుంటే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా ఈవిద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి, తేజస్వీ హైస్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఎంఈఓ విజయ్‌కుమార్, వివిధ కమిటీల బాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత హనుమకొండలోని మర్కజీ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత నృత్యం ఆకట్టుకుంది.



జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు



స్మార్ట్ పెస్టిసైడ్ స్ప్రేయర్

సాగులో ఉత్పత్తి పెంచేందుకు, సాగు సమయంలో రైతులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా స్ప్రే చేసుకొనే స్మార్ట్ పెస్టిసైడ్ స్ప్రేయర్‌ను గైడ్ టీచర్ మురళీకృష్ణ సాయంతో తయారు చేశాడు షైన్ పాఠశాలకు చెందిన విద్యార్థి జశ్వంత్. ఈప్రాజెక్ట్ తయారీకి ఆర్డినో మదర్‌బోర్డ్, ఎల్–289 (సిగ్నల్‌ను రిసీవర్‌గా పంపించే పరికరం), హెచ్‌సీ–05 బ్లూటూత్ నుంచి సెండర్, 12 వోల్ట్స్ హైడ్రాలిక్ మోటార్స్‌ను 12వీ బ్యాటరీస్‌ను వినియోగించారు.




గుర్రపు డెక్క నుంచి జీవ ఇంధనం

పర్యావరణానికి హాని కలిగిస్తున్న గుర్రపు డెక్క నుంచి బయో ఇథనాల్ తయారు చేసేలా గైడ్ టీచర్ కె.వాసు ప్రోత్సాహంతో ఎగ్జిబిట్ ప్రదర్శించింది ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.సాత్విక. గుర్రపుడెక్క ఆకులను పొడిచేసి హైడ్రాలిసిస్ చేసి శిలీంద్రాల ద్వారా డి.లిగ్నిఫికేషన్ జరిపించి దానిలోని లిగ్నో సెల్యూలోజ్ నుంచి బయో ఇథనాల్‌ను తయారు చేయవచ్చని విద్యార్థి సాత్విక వివరించింది.

గార్బేజీ గ్యాస్

పేడతోనూ, వెజిటేబుల్ వేస్టేజీతో గ్యాస్‌ను సృష్టించి వంట చేసుకునేలా గార్బేజీ గ్యాస్ ప్రాజెక్టును రూపొందించింది దేవన్నపేట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి శ్రీవాణి. ఓప్లాస్టిక్ బాక్స్‌లో పేడ వేస్ట్ వెజిటేబుల్‌ను నింపి దాన్ని గ్యాస్‌స్టౌవ్‌కు ఉపయోగించే పైప్‌ను అమర్చింది. ఆపైప్ చివరన విడుదలయ్యే గ్యాస్ ద్వారా మంట పుట్టించవచ్చని విద్యార్థి వివరించింది.





ఎగ్జిబిట్లను తిలకిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

యాంటీ సూసైడ్ సీలింగ్ ఫ్యాన్

ఆత్మహత్యలను కొంత మేర నివారించేందుకు యాంటీ సూసైడల్ సీలింగ్ ఫ్యాన్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు వర్ధన్నపేట సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు నితిన్, భాస్కర్. ఫ్యాన్ రాడ్‌కు స్ప్రింగ్ రాడ్‌ను కూడా బిగించి ఫ్యాన్లను ఏర్పాటు చేసుకుంటే.. ఎవరైనా ఫ్యాన్‌కు ఉరేసుకుంటే వెంటనే స్ప్రింగ్ రాడ్ నుంచి ఫ్యాన్ కిందికి వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు.



ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

జిల్లాలో ఇన్‌స్పైర్ అవార్డులు పొందిన 120 మంది విద్యార్థులు తమ గైడ్ టీచర్లతో కలిసి ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. జిల్లాలో సైన్స్‌ఫేర్‌లో ప్రధాన థీమ్ సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ, ఉపథీమ్‌లు ఆహారం, ఆరోగ్యం పరిశుభ్రత. మేథమెటికల్ మోడలింగ్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్, వ్యర్థ పదార్థాల నిర్వహణ, సహజ వ్యవసాయం, వనరుల నిర్వహణ, విపత్తు నిర్వహణ అంశాలపై 212 మంది తమ గైడ్ టీచర్లతో కలిపి ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. అతిథులు ముందుగా ఈఎగ్జిబిట్లను తిలకించారు.

క్లుప్తంగా

నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్, వరంగల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ స్మారకార్థం నిర్వహించే టోర్నమెంట్ ఈ నెల 30 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు ఓపెన్ మెన్స్ కేటగిరీలో జరగనున్నట్లు వెల్లడించారు. సుబేదారిలోని వరంగల్ క్లబ్ వేదికగా జరిగే టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.2.5 లక్షల నగదు పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ ప్రావీణ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దహనం

● రూ.2లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఇంటి ఎదుట బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని నమిలిగొండలో ప్రమాదవశాత్తు బోనగిరి సాంబరాజుకు చెందిన ఇల్లు, ఇంటిలో వస్తువులు దహనమై రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితులు సాంబరాజు, అపర్ణ దంపతులు తెలిపిన వివరాలు ప్రకారం.. నమిలిగొండ గ్రామానికి చెందిన సాంబరాజు హమాలీ పని చేస్తుండగా అతని భార్య వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం వారు పనులకు, పిల్లలు పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని టీవీ, మంచాలు తదితర ఫర్నీచర్, దుస్తులు, బియ్యం బస్తాలు, రూ.30వేలు నగదు కాలిబూడిదయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు సాంబరాజుకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మంటలను అదుపుచేశారు. కానీ, అప్పటికే వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, సామగ్రి కాలిపోవడంతో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పురమాని రజాక్‌యాదవ్, కాంగ్రెస్ నాయకుడు కుందూరు అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి రూ.5వేలు అందించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాయం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాజీపేట మండలం అయోధ్యపురంలో కొనసాగుతున్న రైల్వే వ్యాగన్ షెడ్ నిర్మాణాలు





ఉద్యమ కల సాకారం

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం 45ఏళ్లు సాగిన పోరాటం

- 1977–1978లో ఆజంజాహి మిల్లులో కార్మికుల తొలగింపుతో తెరపైకి కోచ్ ఫ్యాక్టరీ నినాదం
- 1979లో కమ్యూనిస్టులు భగవాన్ దాస్, కాళిదాస్ ఆధ్వర్యంలో ఉద్యమం
- తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర విభజన చట్టంలో కీలక అంశంగా కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన
- కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ కోసం 13 ఏళ్లు పోరాడిన రైల్వే జేఏసీ
- పీపుల్స్‌వార్, మావోయిస్టుల మద్దతు



నెరవేరనున్న కల

పదమూడున్నరేళ్ల రైల్వే జేఏసీ ఉద్యమంతో కాజీపేటకు రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, నేడు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు బాటలు పడ్డాయి. దీంతో నాలుగు దశాబ్దాల కల సాకారం కానుందని ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాజీపేట రూరల్: ఉమ్మడి జిల్లా ప్రజల ఉపాధికి పెద్దదిక్కుగా ఉన్న నాటి ఆజంజాహి మిల్లులో కార్మికుల సంఖ్యను మెల్లమెల్లగా తగ్గిస్తున్న నేపథ్యంలో.. నాటి కామ్రేడ్లు భగవాన్ దాస్, కాళిదాస్ ఉమ్మడి జిల్లాలో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తెరపైకి తీసుకొచ్చారు. ఊరూరా ఉద్యమించి గల్లీ నుంచి ఢిల్లీ వరకు కోచ్ ఫ్యాక్టరీ నినాదాన్ని తీసుకెళ్లి సక్సెస్ అయ్యారు. వారి పోరాట స్ఫూర్తితో రాజకీయ పార్టీలు, సంఘాలకు అతీతంగా కాజీపేట, వ్యాగన్ షెడ్, కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్ కోసం కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు 13 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేశారు. ఈనేపథ్యంలో రైల్వే వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆజంజాహి కార్మికుల తొలగింపు.. కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం..

జిల్లాలోని ఆజంజాహి మిల్లులో 1977–78లో కార్మికుల తొలగింపు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తే జిల్లాలో కొంత వరకు నిరుద్యోగ సమస్య తీరుతుందని గ్రహించిన నాటి కామ్రేడ్లు భగవాన్‌దాస్, కాళిదాస్ 1978లో ఉద్యమం చేపట్టారు. ఊరూరా సైకిల్ యాత్రలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేశారు. బ్రిటీష్, నిజాం సర్కార్ కాలంలో ఇల్లందులో బొగ్గుగనుల కేంద్రం నుంచి బొగ్గు గనులు తీసి, ట్రైన్ కోచ్ షీట్స్ హీట్ చేసేవారు. ఇల్లందులో కోల్ మైనింగ్ కేంద్రం ఉంది.. కావున కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలనే ఉద్యమం ఎగిసింది. కాజీపేట– మద్రాస్ వరకు అప్పట్లో సింగిల్‌లైన్ ఉంది. జిల్లాలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమిస్తున్న సమయంలోనే మద్రాస్‌లో వ్యాగన్ వర్క్ షాప్ నెలకొల్పారు. తర్వాత కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఇది కూడా జిల్లా నుంచి మద్రాస్‌కు కోచ్ ఫ్యాక్టరీ తరలిపోయిందని చెప్పవచ్చును. ఈక్రమంలో 1982లో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం తీవ్రంగా సాగింది. అదే సమయంలో జిల్లాకు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కూడా మంజూరు అయి తెరమరుగైంది.

వ్యాగన్‌షెడ్ నిర్మాణం

అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

2009లో వ్యాగన్ షెడ్ మంజూరు

కాజీపేట రైల్వే డివిజన్, కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ నేపథ్యంలో 2009లో నాటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ హయాంలో కాజీపేటకు రైల్వే వ్యాగన్ షెడ్ మంజూరైంది. తర్వాత కాజీపేటలో ఎలక్ట్రిక్ షెడ్ నిర్మాణం జరిగింది. 2011లో తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు నేతృత్వంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్ ప్రస్తావన బలంగా ముందుకు సాగింది. తర్వాతర్వాత రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ప్రస్తావన రాజకీయ అంశంగా మారి తెలంగాణ ఉద్యమంలో ప్రధాన డిమాండ్లుగా నిలిచాయి.

1983లో కమిటీ ఏర్పాటు

ప్రధానిగా ఇందిరాగాంధీ ఉన్న సమయంలో కెబినెట్‌లో తెలంగాణ నుంచి మానవవనరుల శాఖ మంత్రిగా పీవీ నర్సింహారావు కొనసాగారు. ఆసమయంలో భగవాన్‌దాస్, కాళిదాస్‌ల పోరాటంతో 1983లో జిల్లాలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని ఇందిరాగాంధీ కమిటీ వేసింది. భూసేకరణ కూడా జరిగింది. అదే ఏడాది (1983)లో ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల్లో జిల్లా నుంచి పీవీ నర్సింహారావు ఓటమి చెందారు. బీజేపీ, టీడీపీ అలయన్స్‌తో కోచ్ ఫ్యాక్టరీ నినాదంతో జంగారెడ్డి ఎంపీ అయ్యారు. హనుమకొండ నుంచి ఓటమి చెందిన పీవీ.. నాగపూర్ రాంటెక్ నుంచి విజయం సాధించారు.

ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్

కాజీపేటలో వ్యాగన్ షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా కేంద్రం కాజీపేటకు ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆర్‌వీఎన్ఎల్ సంస్థ కాజీపేట వ్యాగన్‌షెడ్‌లో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీకి రూ.580 కోట్లు, మరో దఫా రూ.66 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సైతం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాజీపేట రైల్వే డివిజన్‌కు కావాల్సిన సరిహద్దులు ఏర్పాటు చేయాలని రైల్వే జీఎంకు ఆదేశాలు జారీ చేసింది. కాజీపేట వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి లభించనుంది

స్థానికులకు ఉపాధి కల్పించాలి



పంజాబ్‌లోని కపుర్తాల కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలు భర్తీ చేసిన విధంగానే కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్, కోచ్‌ఫ్యాక్టరీలో స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి. లేదంటే ఉద్యమిస్తాం. కేంద్ర ప్రభుత్వం రెండు రైల్వే పరిశ్రమలను నెలకొల్పుతున్నందుకు, స్థలం ఇచ్చిన ఆనాటి రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వే జేఏసీ తరఫున కృతజ్ఞతలు.

– దేవులపల్లి రాఘవేందర్, రైల్వే జేఏసీ కన్వీనర్

ప్రజా ఉద్యమాలదే విజయం



జిల్లాలో 45 ఏళ్ల ప్రజా ఉద్యమ చరిత్ర గల రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్ మంజూరుకు ఆనాడు చేస్తున్న అనేక ఉద్యమాలకు పీపుల్స్‌వార్ సైతం మద్దతు ప్రకటించారు. రైల్వే జేఏసీ రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే వ్యాగన్ షెడ్, కాజీపేట డివిజన్ ఏర్పాటు కోసం చేస్తున్న ఉద్యమాలకు మావోస్టు పార్టీ కూడా మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించడం జరిగింది. ప్రజా ఉద్యమాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయి.

– కొండ్ర నర్సింగరావు, రైల్వే జేఏసీ చైర్మన్

7 నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు

- ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి
- వరంగల్ కలెక్టర్ సత్య శారద



సీఎం కప్ నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సీఎం కప్–2024 పోటీలను విజయవంతం చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సీఎం కప్–2024పై శుక్రవారం అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో గ్రామస్థాయి, 10 నుంచి 12 వరకు మండలస్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి క్రీడాపోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్, పేరా గేమ్స్, ఖోఖో, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, సైక్లింగ్, టేబుల్ టెన్నిస్, లాండ్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, ఆర్చరీ, చెస్, జూడో, బేస్‌బాల్, నెట్ బాల్, సాఫ్ట్‌బాల్, జిమ్నాస్టిక్స్, కరాటే, టైక్వాండో, హాకీ, బాక్సింగ్, కిక్ బాక్సింగ్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, షూటింగ్, స్క్వాష్, బిలియర్డ్స్, షూటింగ్ తదితర క్రీడాపోటీలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులను భాగ్యస్వాములు చేయాలని, నిష్పక్షపాతంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలిచేలా చూడాలన్నారు. వరంగల్‌లోని ఓసిటీ స్టేడియం, చింతల్ మైదానం, దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో నిర్వహించే క్రీడాపోటీలకు అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీ రవీందర్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీవైఎస్‌ఓ సత్యవాణి, డీపీఓ కల్పన, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, సీఎంహెచ్‌ఓ రాజిరెడ్డి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఓ సిటీ స్టేడియంలో సీఎం కప్ క్రీడోత్సవాలు

వరంగల్: వరంగల్ ఓసిటీ మైదానంలో సీఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి టీవీఎల్.సత్యవాణి తెలిపారు. శుక్రవారం ఓసిటీలోని స్టేడియంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈక్రీడల్లో నిర్వహించే పోటీలను, స్పోర్ట్స్ అథారిటీ జారీ చేసిన గైడెన్స్‌ను వారికి వివరించారు.

ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలి

ఖిలా వరంగల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదును కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. తప్పులు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఎంపీడీఓ కార్యాలయాలు, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయాలు, వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల, మెప్మా భవనం, ఏనుమాముల మార్కెట్‌యార్డు భవనంలో వివరాలు నమోదు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, సీపీఓ గోవిందరాజన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

పర్యావరణాన్ని పరిరక్షించాలి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఏఎంఓ సుజన్‌తేజ

కాశిబుగ్గ సెంటర్: సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ, జియో థర్మల్ ఎనర్జీ, హైడ్రో పవర్‌ను ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఏఎంఓ సుజన్‌తేజ సూచించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా వరంగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'రెన్యువబుల్ ఎనర్జీ సోర్సెస్' అంశంపై నిర్వహించిన పోటీల్లో 39 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి ధర్మారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎం.ఈనురుధ్, ద్వితీయ బహుమతి టీజీఆర్ఎస్ నెక్కొండ విద్యార్థిని హాసిని, తృతీయ బహుమతి జీహెచ్ఎస్ ఏబీఫోర్ట్ విద్యార్థి శ్రీకాంత్‌కు అందుకున్నారు. కార్యక్రమంలో ఖిలా వరంగల్ మండల విద్యాశాఖ అధికారి భోక్తుల ప్రసాద్, హెచ్ఎం శారదాబాయి, సురేశ్‌బాబు, నాగేశ్వరరావు, కిరణ్‌కుమార్, సంతోష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి

కాశిబుగ్గ సెంటర్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, హెచ్ఎంలు, ఉపాధ్యాయులను మధ్యాహ్న భోజనం పథకం నుంచి పూర్తిగా మినహాయించాలని టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉటుకూరి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో అనేక లోపాలున్నాయని తెలిపారు. ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజన పథకం కింద ఇస్తున్న రూ.5.45 సరిపోవడం లేదని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.15, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.20 చొప్పున చెల్లించాలని చెప్పారు. అదేవిధంగా గుడ్డు ధర మార్కెట్‌లో రూ.6 నుంచి రూ.7 ఉందని తెలిపారు. ఉపాధ్యాయులకు ఇతర పనులు అప్పగించడంతో బోధన సమయం తగ్గి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో వంట గదులు నిర్మించి, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు నెలనెలా అడ్వాన్స్ చెల్లించాలని కోరారు.

రైతు పండుగకు ఆహ్వానం



డీఏఓ అనురాధ

వరంగల్: కొత్తపేట సమీపంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించనున్న రైతు పండుగకు వరంగల్ మండల పరిధిలోని రైతులు హాజరుకావాలని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి కె.అనురాధ తెలిపారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులనుద్దేశించి మాట్లాడుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారని తెలిపారు. మండలంలోని రైతులు తప్పకుండా రైతు వేదికకు రావాలని కోరారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

మామునూరు: ఇంటి ముందు పార్కు చేసిన రూ.18 లక్షల విలువైన జేసీబీ యంత్రం చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు మామునూరు సబ్ డివిజన్ ఏసీపీ తిరుపతి తెలిపారు. మామునూరు పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ రమేష్‌తో కలిసి ఆయన కేసు వివరాలు వెల్లడించారు. బొల్లికుంట గ్రామానికి చెందిన బొంతు సంపత్ తన ఇంటి ముందు జేసీబీని పార్క్ చేసి ఉంచాడు. ఈనెల 21న ఉదయం ఆ జేసీబీ యంత్రం కనిపించలేదు. దాంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా బొల్లికుంట గ్రామానికి చెందిన ఓర్సు రవిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టి చోరీ వివరాలను రాబట్టారు. నిందితులు ఓర్సు రవి, గుండాల రవి, రాజస్థాన్‌కు చెందిన ఖాసంను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వివరించారు.

పేదింటికి పెద్ద జబ్బు

- రెండు కిడ్నీలు పోయి.. మంచంపట్టి..
- డయాలసిస్‌తో నెట్టుకొస్తున్న యువకుడు
- కిడ్నీ ఇచ్చేందుకు సమ్మతించిన తండ్రి
- ఆర్థిక స్థోమత లేక ఆపరేషన్‌కు దూరం

దీన గాథ



ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న ఉపేందర్

కురవి: భార్య, ఇద్దరు పిల్లలతో హాయిగా జీవిస్తున్న ఓ పేదింటి యువకుడు రెండు కిడ్నీలు చెడిపోయి మంచం పట్టాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన ఇటికాల వెంకటయ్య–ఉప్పలమ్మల పెద్ద కుమారుడు ఉపేందర్ మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. అదే ఆస్పత్రిలో భార్య పార్వతి ఏఎన్ఎంగా పనిచేస్తోంది. వీరికి అర్షిత 8వ తరగతి, నందిత 3వ తరగతి ఉన్నారు. ఉపేందర్‌కు 8 నెలల క్రితం ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రిలో చెక్ చేయించుకున్నాడు. కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. దీంతో హైదరాబాద్‌లో మరోమారు పరీక్ష చేయించాడు. అక్కడ కూడా అదే విషయాన్ని చెప్పిన వైద్యులు డయాలసిస్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈనేపథ్యంలో 8 నెలల నుంచి వారానికి రెండు సార్లు మానుకోటలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. నిత్యం ఆస్పత్రికి వెళ్లడం.. అనారోగ్యంపాలు కావడంతో భార్యభర్తలు ఆస్పత్రిలో ఉద్యోగం మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఈక్రమంలో ఆపరేషన్ చేస్తే ఒక్క కిడ్నీతో బతకవచ్చని డాక్టర్లు చెప్పారు. కానీ, కుటుంబాన్ని పోషించడమే భారంగా మారిన ఉపేందర్‌కు ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేకపోవడంతో దుఃఖసాగరంలో మునిగిపోయాడు.

ఆపరేషన్‌కు రూ.8 లక్షలు..

రెండు కిడ్నీలు చెడిపోయి మంచపట్టిన కుమారుడిని పరిస్థితిని చూసిన తండ్రి వెంకటయ్య కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. కానీ, కిడ్నీ మార్పిడికి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ ఆరోగ్యశ్రీలో చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇద్దరిలో ఒకరికే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వైద్యులు చెప్పడంతో ఆర్థికస్థోమత లేని ఉపేందర్ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు ఆదుకోవాలని ఉపేందర్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దాతలు 97046 10919 ఫోన్ పే నంబర్‌కు తోచిన సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- అనాథలైన పిల్లలు
- గూడ్స్ వాహనం డ్రైవర్ అజాగ్రత్తతో ప్రమాదం



సుభాన్(ఫైల్)



సమ్రిన్(ఫైల్)





తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులు నవాజ్, సోని

గీసుకొండ: సాఫీగా సాగుతున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు చిన్నాభిన్నం చేసింది.. ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కోటగండి సమీపంలో పీడీఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట వరంగల్–నర్సంపేట రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి, మృతుల బంధువులు, గీసుకొండ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఉర్సు దర్గాకు చెందిన ఎండీ సుభాన్(35), సమ్రిన్(29) అనే దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తలు ఉదయం తమ కొత్త సీఎన్‌జీ ఆటోలో పిల్లలు సుమాయ, సోని, నవాజ్‌లను ఎక్కించుకుని నగరంలోని స్కూల్‌లో వదిలిపెట్టారు. అనంతరం గీసుకొండ మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారిలో దస్రు తండా సమీపంలో సీఎన్‌జీ బంక్‌లో గ్యాస్ నింపుకుని ఉదయం 11.10 గంటల సమయంలో తిరిగి వరంగల్ నగరానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పీడీఆర్ గార్డెన్స్ వద్ద వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న సరుకుల రవాణా ట్రక్కు డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వారి ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సమ్రిన్ అక్కడే మృతి చెందగా, సుభాన్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సుభాన్ మామ ఎండీ సోఫీ ఫిర్యాదు మేరకు ట్రక్ డ్రైవర్ గడ్డం జస్వంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ఇన్‌చార్జ్ డీసీపీఓ బాధ్యతల స్వీకరణ

కాశిబుగ్గ సెంటర్: వరంగల్ బాలరక్షాభవన్ ఇన్‌చార్జ్ డీసీపీఓగా నర్సంపేట ఏసీడీపీఓ శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ ఇటీవల సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాలరక్షాభవన్‌ను ప్రక్షాళన చేయాలని డీడబ్ల్యూఓను ఆదేశించారు. దీంతో ఇంతకు ముందు విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌చార్జ్ డీసీపీఓను బాధ్యతలను తప్పించి శ్రీదేవికి అప్పగించారు.